క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు, చింతరపల్లిలో గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

రోడ్డు నిబంధనలు పాటించండి



డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎంవీఐ రాజాబాబు

గుత్తి: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని గుంతకల్లు ఎంవీఐ (మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్) రాజాబాబు సూచించారు. గుత్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బుధవారం రాత్రి జాతీయ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో, కారు, జీపు డ్రైవర్లను ఉద్దేశించి ఎంవీఐ మాట్లాడారు. అతి వేగం, సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, తాగి డ్రైవ్ చేయడం, సెల్ ఫోన్ డ్రైవింగ్ వంటి కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. అందరూ రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు.

ప్రజాపిత బ్రహ్మాబాబాకు ఘన నివాళి

తాడిపత్రి టౌన్: స్థానిక తేరు బజార్ ఓంశాంతి మందిరంలో బుధవారం ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయ ఫౌండర్ ప్రజాపిత బ్రహ్మాబాబా 54 వర్ధంతి సభ జరిగింది. బ్రహ్మాబాబా చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయ ప్రతినిధి బ్రహ్మకుమారి పద్మక్క, చింతల వెంకటరమణస్వామి ఆలయ కమిటీ చైర్మన్ బాణా నాగేశ్వరరెడ్డి, రోటరీ క్లబ్ సభ్యుడు పెద్దిమద్దిలేటి, వాసవీక్లబ్ సభ్యురాలు భూమా నాగిరాగిణి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా పోస్టర్ల విడుదల

గుత్తి: స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం ఫిబ్రవరి 22న విజయవాడలో జరుగనున్న మహాధర్నా పోస్టర్లను విడుదల చేశారు. సీపీఐ మండల కార్యదర్శి రామదాసు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో మహాధర్నా చేపట్టామన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సీనియర్ నాయకులు రమేష్, మధు, ఎరుకలప్ప, నరసింహులు పాల్గొన్నారు.

23 నుంచి కబడ్డీ పోటీలు

తాడిపత్రి టౌన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి పురస్కరించుకుని అనంతపురంలో ఈనెల 23 నుంచి రెండు రోజులపాటు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. నియోజకవర్గ కన్వీనర్ రంగనాథరెడ్డి, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు భీమలింగేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి చెన్నారంగనాయకులు, మైనార్టీ విభాగం పట్టణాధ్యక్షుడు రజాక్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

గుంతకల్లుటౌన్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టేలా బీజేపీ అధినాయకత్వంపై ఒత్తిడి పెంచాలని ఎమ్మార్పీఎస్ నాయకులు స్థానిక బీజేపీ నాయకులను కోరారు. బుధవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి భీమలింగ, శ్రీనివాసులు, ఎర్రిస్వామి తదితరులు బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిమి రామాంజి, పట్టణ అధ్యక్షుడు రాఘవేంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు.

కొజ్జేపల్లిలో ఊరి జాతర

గుత్తి రూరల్: కొజ్జేపల్లిలో బుధవారం పెద్దమ్మ, సుంకులమ్మ జాతరను గ్రామస్తులు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెద్దమ్మ, సుంకులమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూరుబీ పెద్దమ్మ ఆలయంలో పూజలు చేశారు. సర్పంచ్ రామలింగమయ్య, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మల్లయ్యయాదవ్, స్థానిక నాయకులు మహాలింగ, మహేశ్వరప్ప, రాము యాదవ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి,సర్పంచ్ మజ్జిగ గోపాల్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పుట్లూరు: కోమటికుంట్ల గ్రామ సమీపంలో బుధవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటప్రసాద్ తెలిపారు. నిందితుల నుంచి రూ.26,700 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నాటుసారా స్వాధీనం

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని పత్తికొండ ఓవర్ బ్రిడ్జి వద్ద సెబ్ సీఐ వరలక్ష్మి నేతృత్వంలో మంగళవారం అర్ధరాత్రి నాటుసారా పట్టుకున్నారు. సెబ్ పోలీసులు రూట్ వాచ్ నిర్వహిస్తుండగా గమనించిన మిద్దె తాండాకు చెందిన బామ్లా నాయక్ బైక్, నాటుసారా వదిలిపారిపోయాడు. 128 లీటర్ల నాటుసారా, బైక్, స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వరలక్ష్మి తెలిపారు.

గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు



లబ్ధిదారులకు ఇంటి పట్టాలతోపాటు చీరలు, పసుపు,కుంకుమ అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

తాడిపత్రి: గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామాల్లోనే సేవలు అందిస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సజ్జలదిన్నెలో గ్రామ సచివాలయ భవనంతో పాటు ఆర్బీకే, మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే సర్పంచ్ నీరజతో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమన్నారు. ప్రజలు పనుల కోసం పట్టణాలు, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే పనులు జరిగేలా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. గ్రామ సచివాలయాలతోపాటు రైతు భరోసా కేంద్రాలు అద్భుతమైన సేవలు అందిస్తున్నాయన్నారు. వాటి పనితీరుతో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం ఆయన బోడాయిపల్లి, సజ్జలదిన్నె గ్రామాలకు చెందిన ముగ్గురికి రూ.2.3 లక్షల సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు.

ఇంటి పట్టాల పంపిణీ

సజ్జలదిన్నె జగనన్న కాలనీలో ఇళ్లులేని నిరుపేద మహిళలకు మంజూరైన ఇంటి పట్టాలను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సర్పంచ్ నీరజతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంటి పట్టాతో పాటు వారికి చీర, గాజులు, పసుపు, కుంకుమను సర్పంచ్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రాజుతో సహకారంతో అందజేశారు. ఇప్పటికీ అర్హులైన వారు ఇంకా ఉంటే వారందరికీ ఇంటి పట్టాలు అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం దశల వారీగా దాదాపు రూ.2.30 లక్షల ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఒక వేళ ఇళ్లు నిర్మించుకునే స్తోమత లేని వారికి ప్రభుత్వమే ఉచితంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరరెడ్డి, తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ రంగారావు, ఈఓఆర్డీ జిలాన్ బాషా, ఏఓ మహితా కిరణ్, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ, ఆర్బీకే సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

భోగేశ్వరాలయ అభివృద్ధికి కృషి



భోగేశ్వరాలయ నూతన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి

పామిడి: భోగేశ్వరాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక భోగేశ్వరాలయంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్‌గా ఎన్ మురళీధర్, సభ్యులుగా పీవీ వెంకట్రాముడు, ఎం యంగమ్మ, పీ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్ కవిత, కే నారాయణమూర్తి, ఈ నరసింహులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ గోపురం నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. అంతకుముందు ఆయన స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. మండల ఇన్‌ఛార్జ్ జానకిరామిరెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, నాయకులు జోజోడే కుమార్, జగని రవి, బీ ఆసిఫ్, బీకే అన్వర్‌బాషా, సీ అబ్దుల్‌రజాక్, ఇస్మాయిల్, ఫర్యాద్, పట్టణ బీసీసెల్ కన్వీనర్ చీమల నగేష, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

యాడికి: మండల కేంద్రంలో మట్కా రాస్తున్న ఆరుగురిని పోలీసులు పట్టుకున్నారు. మండల కేంద్రానికి చెందిన మాబీ, బాలమ్మ, జబ్బీర్, కరుణాకర్, నాగేష్, ఆదినారాయణ అరెస్ట్ చేసి రూ.45,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే తమకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

రోడ్డు మరమ్మతు



రామకోటి వద్ద రోడ్డు ముళ్ల కంపలు తొలగిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో ఈనెల 22 నుంచి స్వామి తిరునాల జరుగనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పెద్దపప్పూరు నుంచి అశ్వర్థం క్షేత్రం వరకు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను జేసీబీతో తొలగించడంతోపాటు రోడ్డు మరమ్మత చేయించారు. ఇదిలా ఉండగా ఆర్అండ్‌బీ అధికారులు పెన్నానది కాజ్ వేపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేశారు. గార్లదిన్నె సర్పంచు జొన్నకుంట హేమ సుందర్‌రెడ్డి కాజ్ వేపై ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేయించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: కొజ్జేపల్లి గ్రామ శివారులో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. తురకపల్లికి చెందిన సురేంద్ర కొజ్జేపల్లిలో జరిగే ఊరు దేవరకు వెళ్లాడు. మంగళవారం అర్ధరాత్రి తిరిగి తురకపల్లికి బైక్‌పై వెళ్తుండగా గ్రామ శివారులోని మలుపు వద్ద నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన విజయ్ బైక్‌తో ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సురేంద్ర, విజయ్‌ను 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా పడి...

పెద్దవడుగూరు : మండల కేంద్రం గ్రామం సమీపంలో మలుపు వద్ద ఆటో బోల్తాపడి ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుల కుటుంబ సభ్యుల సమాచారం మేరకు... పెద్దవడుగూరుకు చెందిన లక్ష్మీదేవి, రాముడు లక్ష్ముంపల్లి గ్రామంలో జరిగిన దేవర హాజరై స్వగ్రామానికి ఆటోలో బయలుదేరారు. మలుపు వద్ద ఒక్కసారిగా ఆటో బోల్తాపడటంతో ఆటోలో ఉన్న లక్ష్మీదేవి, రాముడు తీవ్రగాయాలయ్యాయి. మరో ప్రయాణికులు, ఆటో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను అనంతపురం తరలించారు. ఏఎస్ఐ నారాయణనాయక్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

రబీ వేరుశనగలో యాజమాన్యం పాటించండి

బుక్కరాయసముద్రం: రబీ సీజన్‌గా రైతులు సాగుచేసిన వేరుశనగ పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్ అన్నారు. బీకేఎస్ మండలం రేకులకుంటలో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడారు. వాలుకు అడ్డంగా సేద్యం చేసుకోవాలని సూచించారు. దీని వల్ల భూమిలో తేమశాతం పెరుగుతుందన్నారు. భూమిలో కర్బన, నత్రజని, భాస్వరం కొట్టుకుపోకుండా ఉంటుందన్నారు. వేసవిలో తొలకరి వర్షాలు కురవగానే దుక్కులు చేసుకుంటే వేరుకుళ్లు పురుగులు నశిస్తాయన్నారు. వేరుశనగ సాగులో యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకట్రాముడు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శైలజ, మండల వ్యవసాయ శాఖ అధికారి శ్యాం సుందరరెడ్డి, శంకర్ లాల్ నాయక్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు



రాతిదూలం లాగుడు పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

పామిడి: అంకాలమ్మ, కుంటిమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన న్యూ కేటగిరీ రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో తాడిపత్రి రైతు రమేష్‌యాదవ్ వృషభాలు మొదటిస్థానంలో నిలిచి రూ.40 వేలు నగదు బహుమతి గెలుచుకున్నాయి. నంద్యాల జిల్లా మిడుతూరు మండలం రోళ్లపాడు రైతుమురళీమోహన్‌రెడ్డి వృషభాలు ద్వితీయ(రూ.30వేలు) పెద్దపప్పూరు మండలం సోదనపల్లి రైతు ప్రసాద్‌నాయుడు వృషభాలు తృతీయ(రూ.20వేలు), పెద్దవడుగూరు మండలం మేడిమాకులపల్లి రైతు తిరుపాల్‌రెడ్డి వృషభాలు నాల్గో(రూ.10 వేలు) నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం టీ హుసేనాపురం రామసుబ్బారెడ్డి వృషభాలు ఐదోస్థానంలో నిలిచి రూ.5వేలు అందుకున్నాయి.

అంకాలమ్మ, కుంటిమ్మకు ప్రత్యేక పూజలు

కొండూరు రోడ్డులో వెలసిన అంకాలమ్మ, కుంటిమ్మకు జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేయించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌ఛార్జ్ జానకిరామిరెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, చుక్కలూరు రామచంద్రారెడ్డి, జోజోడే కుమార్, జగని రవి, అనుంపల్లి సూరి తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంతో ఆదాయం



కల్లూరులో పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్‌పీఓ సుమన జయంతి

గార్లదిన్నె: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుందని డీఎల్‌పీఓ సుమన్ జయంతి పేర్కొన్నారు. బుధవారం కల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని డీఎల్‌పీఓ తనిఖీ చేశారు. ఈసం దర్భంగా గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. తొందరలోనే పంచాయతీ అధికారులు రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని స్థలం కేటాయించుకొని వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. సక్రమంగా రికార్డులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన భూసర్వేలో హౌసింగ్ రికార్డులు కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



బీకేఎస్‌లో కేక్ కట్ చేసి పంచిపెడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు



శింగనమలలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పుట్టిన రోజు వేడుకలు బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా జరిపారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేసి, సంబరాలు జరుపుకున్నారు. నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే అభివృద్ధి కోసం ఎంతోకృషి చేసిందన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ కేటాయించి ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు పరిష్కరించిందన్నారు. మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ బాబా యునీస్, సర్పంచులు ఉషారాణి, హిమకుమారి, ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: సొసైటీ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే ప్రత్యేక ముద్ర వేసుకున్నారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సాగునీరు అందించారని గుర్తు చేశారు. అనంతరం సర్పంచ్ పార్వతి, జెడ్పీటీసీ భాస్కర్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఆర్డీటీ బధిరుల పాఠశాలలో ఎంపీటీసీ కాలువ వెంకటలక్ష్మి, కాలువ నారాయణస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఆలూరు రమణారెడ్డి, ఎంపీపీ సునీత, ఎంపీటీసీ సుజాత, మండల కన్వీనర్ అంకే నరేష్, పూల నారాయణస్వామి, ముత్యాల శీన, కొండమ్మ, పురుషోత్తం, కొండన్న, కాటమయ్య, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శింగనమల: ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి జన్మదినం సందర్భంగా స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి కేక్ కట్ చేశారు. డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చడానికి కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో తాగునీరు, సాగునీరుకు ఇబ్బంది లేకుండా చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్రాముడు, వైఎస్సార్‌సీపీ నేత నగేష్, తదితరులు పాల్గొన్నారు.

బలవర్ధక ఆహారంపై చైతన్యపరచండి

గార్లదిన్నె: గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం అందజేస్తున్న పోర్టిఫైడ్ బియ్యం (బలవర్ధక బియ్యం)పై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు డీఎస్‌ఓ శోభారాణి సూచించారు. గార్లదిన్నె మండలం యర్రగుంట్ల అంగన్‌వాడీ కేంద్రం-2ను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పోర్టిఫైడ్ బియ్యంపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఎంతో విలువైన మినరల్స్ కలిగిన పోర్టిఫైడ్ బియ్యాన్ని ప్లాస్టిక్ బియ్యంగా భావించరాదని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పంపిణీ చేసే పోర్టిఫైడ్ బియ్యంలో సూక్ష్మ పోషకాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ బియ్యాన్ని ఆహారంగా తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతల్లో పలు రుగ్మతలు దూరమవుతాయన్నారు. ఈ అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. సీడీపీఓ ధనలక్ష్మి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



కిడ్నీ బాధితుడిని పరామర్శిస్తున్న జొన్నలగడ్డ నిర్మలాదేవి

శింగనమల: పెద్దమట్లగొందికి చెందిన కార్తీక్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తల్లి జొన్నలగడ్డ నిర్మలాదేవి బుధవారం గ్రామానికి చేరుకుని కార్తీక్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా వారికి కొంత నగదుతో పాటు 3 నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ యోగానందరెడ్డి

పుట్లూరు: మండలవ్యాప్తంగా ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా సొంత గ్రామంలో ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఓ చెన్నకేశవులు, బీఎఫ్‌టీ రామాంజులరెడ్డి పాల్గొన్నారు.

యల్లనూరు: ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ పనులను కల్పించి ప్రగతి లక్ష్యాలను చేరుకోవాలని డీఎల్‌డీవో ఓబులమ్మ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఓబులమ్మ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి 100 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. పనులు నాణ్యతగా చేయించాలని టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, ఏపీఓ షబ్బీర్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: మండలంలో రోజూ వెయ్యి మందికి విధిగా పని కల్పించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పంచాయతీలో జనాభా ప్రాతిపదికన పని కల్పించాల్సిన బాధ్యత క్షేత్ర సహాయకులపై ఉందన్నారు. జాబ్ కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయాలని సూచించారు. ఏపీఓ రమేష్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

త్వరితగతిన సేవలు అందించండి



సచివాలయ సిబ్బందితో డీఎల్‌డీఓ ఓబుళమ్మ

పుట్లూరు: గ్రామ సచివాలయాలకు వచ్చే ప్రజలకు త్వరితగతిన సేవలను అందించాలని డివిజినల్ అభివృద్ధి అధికారి ఓబుళమ్మ సిబ్బందికి సూచించారు. బుధవారం ఆమె పుట్లూరు, తక్కళ్లపల్లి, శనగలగూడూరు గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ సచివాలయాల్లో అందించిన సేవలను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఈఓఆర్డీ ఆనంద్‌ప్రసాద్ పాల్గొన్నారు.

యల్లనూరు: సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అనంతపురం డీఎల్‌డీవో ఓబుళమ్మ పేర్కొన్నారు. బుధవారం నిట్టూరు, పెద్ద మల్లేపల్లి, యల్లనూరు-1 సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. సచివాలయ పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ సర్వేను త్వరగతిన పూర్తి చేయాలన్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి నిర్వహించే మెగా ఆధార్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ప్రతి ప్రభుత్వ, సచివాలయ ఉద్యోగి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓరామచంద్రారెడ్డి, ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు, పంచాయతీ కార్యదరులు గీతా, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ, గంగమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: శింగనగుట్టపల్లిలో బుధవారం పెద్దమ్మ ,గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారి ప్రతిమను గ్రామ పురవీధుల్లో తప్పెట్లు, మేళతాళాలతో ఊరేగించారు. మరోవైపు తొగటవీర క్షత్రియులు నిర్వహించిన జ్యోతుల మహోత్సవం కనుల పండువగా సాగింది. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరుకాగా వైస్ ఎంపీపీ పప్పక కళావతి, వైఎస్సార్‌సీపీ నేత గంగరాజు, గ్రామస్తులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దబాబుకు పరామర్శ

ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తబ్జూల వైఎస్సార్‌సీపీ నేత పెద్దబాబు(చంద్రశేఖరరెడ్డి)ను బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించారు. పెద్దబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అన్నివిధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథరెడ్డి, సీనియర్ నాయకులు వరదాయపల్లి శివారెడ్డి, గంగిరెడ్డి, నాయకులు విజయ నాగేందర్‌రెడ్డి, నాగిరెడ్డి ఉన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల్లో గురువారం నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ పేర్కొన్నారు. ఈనెల 19 నుంచి 24 వరకు మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాలు పని చేస్తాయన్నారు. 2011 నుంచి 2016 వరకూ ఆధార్ తీసుకున్న వారు, కొత్తగా ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్న వారు డాక్యుమెంట్ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా గురువారం నుంచి గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 19న పుట్లూరు, కడవకల్లు, మడ్డిపల్లి, తక్కళ్లపల్లి, 20న శనగలగూడూరు, ఎల్లుట్ల, చెర్లోపల్లి, బాలాపురం, 21న కోమటికుంట్ల, 23న అరకటివేముల, మడుగుపల్లి, కందికాపుల, 24న కుమ్మనమల, సూరేపల్లి గ్రామాల్లో మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు.

వృద్ధురాలి మృతి

యల్లనూరు: తిమ్మంపల్లిలో వంట చేస్తూ చీరకు నిప్పంటుకుని తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు మృతి చెందింది. ఎస్‌ఐ రామకృష్ణ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఆరవేటి ఈశ్వరమ్మ (82) మంగళవారం ఉదయం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన కుటుంబసభ్యులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందింది. మృతురాలి కుమార్తె రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.